
ప్రజాశక్తి
శుక్రవారం 31 అక్టోబర్ 2025 5
శ్రీ సత్యసాయి



1న తలుపులకు ముఖ్యమంత్రి చంద్రబాబు



ప్రజాశక్తి - తలుపుల

శ్రీ సత్యసాయి జిల్లా కదిరి నియోజకవర్గం తలుపుల మండలంలో నవంబర్ 1న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పర్యటన ఉంటుందని అధికారులు తెలిపారు. సామాజిక పింఛను పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొననున్నారని వివరించారు. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో స్థానిక ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ఆధ్వర్యంలో అధికారులు ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నారు. పింఛన్ల పంపిణీ అనంతరం కృష్ణాజలాలకు జలహారతి ఇవ్వనున్నట్లు టిడిపి నాయకులు తెలిపారు.

కల్లు కల్తీ జరిగిందా..?

మత్తు కోసం మతిస్థిమితం కోల్పోయారా...?

అధికారుల ప్రకటనలపై అనుమానాలు



బుధవారం రాత్రి ఆసుపత్రికి వచ్చిన మహిళలు

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం రూరల్ మండలం, పరగి మండల పరిధిలో 20 మంది వరకు కల్తీ కల్లు తాగి అస్వస్థతకు గురైన ఘటన వెలుగుచూడటంతో ప్రతి పక్షంతో పాటు ప్రజా సంఘాల నాయకులు అధికారులు, పాలకుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు.. దీంతో ఒక పక్క జిల్లా వైద్యాధికారిణి ఫైరోజ్ బేగం, జిల్లా ఎక్సైజ్ సూపరిటెండెంట్ గోవింద నాయక్‌లు పట్టణానికి వచ్చారు. వైద్యాధికారి అసుపత్రికి వెళ్లి చికిత్స పొందుతున్న వారిని పరామర్శించారు. ఒక్కసారిగా మత్తు పదార్థాలు తీసుకోవటం ఆపడం వల్ల మత్తుకు బానిసైన వారు మతిస్థిమితం కోల్పోయినట్లు వ్యవహరిస్తారని వారు పేర్కొన్నారు. అదే విధంగానే కల్లులో కల్తీ జరగలేదని, నిత్యం తాము శాంపుల్ తీస్తున్నామని ఎక్సైజ్ అధికారులు చెప్పారు. అయితే ఇంతకి కల్లులో కల్తీ జరిగిందా,లేదా అని తేల్చాల్సింది ఎవరన్న ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి. అసుపత్రిలో చికిత్స పొందుతున్న వారి నుంచి రక్త నమూనాలను సేకరించి వివరాలను వెల్లడించకుండా వైద్యులు చెప్పినట్టే ఎక్సైజ్ అధికారులు చెప్పడం చూస్తుంటే పలు అనుమానాలకు దారి తీస్తోంది. వాస్తవానికి జిల్లా వ్యాప్తంగా ఎన్ని టిఎఫ్‌టిలు ఉన్నాయి. ఎన్ని ఈత వనాలు ఉన్నాయి. రోజుకు ఒక్క చెట్టు నుంచి ఎంత కల్లు వస్తోంది. ఒక దుకాణానికి ఎన్ని లీటర్ల కల్లు సరఫరా చేస్తున్నారన్న కోణంలో విచారణ చేయాల్సిన అధికారులు కనీస విచారణ చేయకుండానే కల్తీ లేదని చెప్పడం వెనుక అధికార పార్టీ నేతల హస్తం ఉన్నట్లు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. హిందూపురంలో ఒక్క సారిగ కల్తీ కల్లు వ్యవహారం బయటకు రావడం, వెంటనే జిల్లా అధికారులు హుటాహుటిన హిందూపురం వచ్చి విలేకరుల సమావేశాలు ఏర్పాటు చేయడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కల్లు వ్యాపారులకు అధికార పార్టీ నేతల అండదండలు ఉండడంతోనే ఇది సాధ్యం అయిందని ప్రజలు వ్యాఖ్యానిస్తున్నారు.

వాస్తవం ఇది....

హిందూపురం మండలం చౌలూరు గ్రామంలో కల్తీ కల్లు సేవించి 10 మందికి అస్వస్థతకు గురయ్యారు. అలాగే పెనుగొండ నియోజకవర్గంలోని పరిగి మండలం శ్రీరంగరాజులపల్లి, మోద, కొడిగేపల్లి, పెద్దిరెడ్డిపల్లి ప్రాంతాలలో కూడా మరో పది మంది కల్తీకల్లు సేవించి అస్వస్థతకు గురయ్యారు. మత్తు కోసం కల్లు తాగుతున్నప్పటికి వృద్ధులు, మహిళలు వింతగా ప్రవర్తిస్తున్నారు. ఎన్నో రోజులుగా కల్లు తాగుతున్నప్పటికీ గత వారం రోజులుగా వీరు వింతగా ప్రవర్తించడం ప్రారంభించడంతో కుటుంబ సభ్యులు కొందరిని ఆసుపత్రికి తరలించారు. రోజురోజుకి అలా ప్రవర్తించే వారి సంఖ్య 20 సంఖ్యకు చేరింది, తాము పగలంతా కష్టపడి పని చేసి సాయంత్రం సమయంలో కొద్దిగా ఉపశమనం కోసం కల్లు తీసుకుంటుమని ఇది ఇలా తమ ప్రాణాల మీదకి తెస్తుందని అనుకోలేదని వారు అంటున్నారు. విచిత్రంగా ప్రవర్తించడం, తమ వారిని గుర్తించలేకపోవడం, తమలో తామే మాట్లాడుకోవడం చేస్తున్నారని వారి కుటుంబసభ్యులు చెబుతున్నారు. వారం రోజుల నుండి ఇలా ప్రవర్తిస్తున్నారని ఇంకా పెరిగే అవకాశం ఉందని అంటున్నారు. ఆయా గ్రామాల ప్రజలు, కుటుంబ సభ్యుల ద్వారా వచ్చిన వారు ఆసుపత్రులకు చేరినప్పటికీ చాలామంది ఒంటరిగా ఉన్నవారి పరిస్థితి ఏమిటన్నది ప్రశ్నార్థకంగా మారింది. రెక్కాడితే గాని డొక్కాడని అతి సామాన్య ప్రజలు కల్తీ కల్లుకు బలవుతున్నట్లు బాధిత కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే పరీక్షించిన వైద్యులు నిత్యం కల్లు సేవించే వారు కల్లు సేవించడానికి విరామం ఇవ్వడంతోనే ఇలాంటి లక్షణాలు వస్తున్నాయని చెబుతున్నారు. ఎక్సైజ్ శాఖ అధికారులు మూడు రోజులుగా వర్షాలు రావడంతో కల్లు దొరక్క కల్లు సేవించకపోవడంతో వారికి ఇలాంటి లక్షణాలు వచ్చాయని అంటున్నారు. అయితే పకృతి సిద్దంగా లభించే కల్లును మానేస్తే ఇలా ప్రవర్తిస్తారా. దీనిని వైద్యులు సైతం నిర్ధారించడం చేస్తుంటే ఖచ్చితంగా కల్లులో కల్తీ జరిగిందనే అనుమానాలు బలంగా వినపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు కల్తీకి అడ్డుకట్ట వేస్తారా లేక అధికార పార్టీ నాయకుల మాటలకు తలొగ్గి చూసి చూడనట్లు వదిలేస్తారా అన్నది వేచి చూడాల్సిందే.



టిడిపి సభ్యుల తీరుపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్న వైసిపి కౌన్సిలర్లు

జిల్లా కేంద్రంపై గళం విప్పిన వైసిపి.. నోరు మెదపని టిడిపి...

కౌన్సిల్‌మీట్‌లో టిడిపి వైఖరిపై వైసిపి కౌన్సిలర్ల అసంతృప్తి

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం కేంద్రంగా సత్య సాయి జిల్లాను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ కౌన్సిల్లో తీర్మానం పెట్టాలని ప్రతిపక్షంలో ఉన్న వైసిపికి చెందిన వైస్ చైర్మన్ బలరామిరెడ్డి, ప్రతిపక్ష నేత అసిఫ్ వుల్లా తోపాటు ఆపార్టీ కౌన్సిలర్లు డిమాండ్ చేశారు. గురువారం మున్సిపల్ చైర్మన్ రమేష్ కుమార్ అధ్యక్షతన కౌన్సిల్ హాలులో కౌన్సిల్ అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు 19 అంశాలతో కూడిన అజెండాను కౌన్సిల్ దృష్టికి తీసుకొచ్చారు. సభ ప్రారంభంలోనే వైసిపి కౌన్సిలర్లు శ్రీ సత్య సాయి జిల్లాలోని అన్ని సౌకర్యాలు ఉన్న ఏకైక పట్టణం హిందూపురం అని హిందూపురం కేంద్రంగా సత్య సాయి జిల్లాను ఏర్పాటు చేయాలని అన్నారు. దీనిపై కౌన్సిల్లో ఉన్న ప్రతి ఒక్కరు తీర్మానం చేసి ప్రభుత్వానికి పంపాలని పట్టుబట్టారు. అధికారంలో ఉన్న టీడీపీ దీనిపై నోరు మెదపకపోవడంతో కనీసం చేతులెత్తి మద్దతు పలకాలని వైసిపి కౌన్సిలర్లు కోరినప్పటికీ టిడిపి కౌన్సిలర్లు ఏ ఒక్కరు కూడా కనీసం చేతులు ఎత్తి మద్దతు పలకలేదు. దీంతో వైసిపి కౌన్సిలర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా కేంద్రం విషయంలో గతంలో స్థానిక ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ రాజీనామాకు సిద్ధమని ప్రకటించారని దీనికి ఇప్పుడు బాలకృష్ణ సిద్ధంగా ఉన్నారా అని బలరామిరెడ్డి ప్రశ్నించారు. దీంతో కొద్దిసేపు టిడిపి వైసిపికౌన్సిలర్ల మధ్య మాటల యుద్ధం జరిగింది. చివరకు మున్సిపల్ చైర్మన్ రమేష్ కుమార్ మాట్లాడుతూ మరో వారం రోజుల్లో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసి హిందూపురం కేంద్రంగా సత్య సాయి జిల్లాలో ఏర్పాటు చేయాలని తీర్మానం చేసి ప్రభుత్వానికి పంపుదామని చెప్పడంతో వైసిపి కౌన్సిలర్లు శాంతించి వారి సీట్లలో కూర్చున్నారు. అనంతరం అజెండాపై చర్చలు జరిపి 19 అంశాలను ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. ఈ సమావేశంలో కౌన్సిలర్లతో పాటు మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

జిల్లా ఆర్థికప్రగతికి పరిశ్రమల స్థాపన అవసరం

కలెక్టర్ శ్యాంప్రసాద్

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్


జిల్లా ఆర్థిక ప్రగతికి పరిశ్రమల స్థాపన ఎంతో అవసరమని అందుకు అధికారులందరూ సమన్వయంతో కృషి చేయాలని కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్లో జిల్లా పారిశ్రామిక ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమీక్ష సమావేశం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా పరిశ్రమల స్థాపన సింగల్ డెస్క్ పోర్టల్ ద్వారా అనుమతులకు వచ్చిన దరఖాస్తులను సమీక్షించారు. పెట్టుబడి రాయితీ క్రింద 17 పరిశ్రమలకు గాను రూ. 12 46 కోట్లు మంజూరు అయిందని, అమ్మకం పన్ను రాయితీ క్రింద రూ. 1.10 కోట్లు, టెక్స్టైల్స్ పాలసీ క్రింద వడ్డీ రాయితీ రూ.16.18 లక్షలు మంజూరు చేయడం జరిగిందని కలెక్టర్ వివరించారు. వచ్చే నవంబర్లో 14,15 తేదీలలో విశాఖలో జరిగే పార్ట్‌నర్‌షిప్ సమ్మిట్ కు సంబంధించి అవగాహన ఒప్పందాలు భూమి పూజలు ప్రారంభోత్సవాలు గురించి చర్చించారు. జిల్లాలో ప్రారంభోత్సవాలకు 5 పరిశ్రమలు, భూమి పూజకు 7 పరిశ్రమలు గురించి సమీక్షించారు. ఏపీఐఐసీకి సంబంధించిన పరిశ్రమల ప్రగతి గురించి చర్చించారు. ఈ సమావేశంలో పరిశ్రమల జనరల్ మేనేజర్ నాగరాజు, జోనల్ మేనేజర్ నాగ కుమార్, జిల్లా పంచాయతీ అధికారి సమత, విద్యుత్ శాఖ ఎస్ఇ సంపత్ కుమార్, డిప్యూటీ ఇన్స్‌పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ రాధాకృష్ణ, డిఆర్‌డిఎ పీడీ నరసయ్య, ఎల్‌డిఎం రమణ కుమార్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వైద్య కళాశాలల ప్రయివేటీకరణ దుర్మార్గం

కోటి సంతకాల సేకరణలో మాజీ మంత్రి

ప్రజాశక్తి-సోమందేపల్లి

వైద్య కళాశాలల ప్రయివేటీకరణ నిర్ణయం దుర్మార్గమని వైసిపి జిల్లా అధ్యక్షురాలు, మాజీ మంత్రి ఉషశ్రీ చరణ్ విమర్శించారు. మండలం కేంద్రంలోని కొత్తపల్లి క్రాస్‌లో గురువారం వైసిపి ఆధ్వర్యంలో చేపట్టిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉషశ్రీ చరణ్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజల ఆరోగ్యాలను కాపాడే విధంగా మెడికల్ కాలేజీలను ప్రభుత్వమే నడపాలన్నారు. ఈ విషయంపై ప్రజల అభిప్రాయాలు తెలుసుకొని, వారితో స్వచ్ఛందంగా సంతకాలు సేకరిస్తున్నామన్నారు. వైసిపి చేపట్టిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమానికి ప్రజల నుండి విశేష స్పందన వస్తుందని, ఇందులో ప్రధానంగా టిడిపి నాయకులే సంతకాలు పెడుతున్నారని చెప్పారు. రాష్ట్రంలో మొంథా తుఫాన్ బాధితులను ఆదుకోవటంలో కూటమి ప్రభుత్వం విఫలమైందన్నారు. సిఎం చంద్రబాబు కేవలం గాల్లోనే తిరుగుతూ ఫోజులు ఇచ్చారని ఎద్దేవా చేశారు. స్థానిక మంత్రి సవిత మెడికల్ కాలేజీపై మాట్లాడటం లేదని, పాలసముద్రం వద్ద వైసిపి హయాంలో రైతుల కోసం కట్టించిన గోడౌన్లను లిక్కర్ సప్లై గోడౌన్ గా మార్చిందని విమర్శించారు. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ ఆపకపోతే వైసీపీ ఆధ్వర్యంలో భవిష్యత్తులో ఆందోళనలు మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ గజేంద్ర, జడ్పిటిసి డిసి అశోక్, వైస్ ఎంపీపీ వెంకటనారాయణ రెడ్డి, సోమందేపల్లి పట్టణ అధ్యక్షులు గోవిందమ్మ గారి శ్రీనివాసులు, చాలకూరు లక్ష్మీనరసప్ప, మేజర్ పంచాయతీ ఉపసర్పంచి వేణు, డాక్టర్ బాబు, చల్లపల్లి జితేందర్ రెడ్డి, ఇమామ్ వలి, బండా శివ, ఎంపిటీసీ పూల నాగప్ప, బ్రాహ్మణపల్లి సర్పంచి జిలాన్ ఖాన్, బ్రహ్మసముద్రం సర్పంచి పరంధామ, ముద్దపుకుంటా సర్పంచి కిష్టప్ప, మహిళా అధ్యక్షురాలు గాజుల మణెమ్మ, ఎంపిటీసీ పూజారి ఈశ్వరయ్య, పట్టణ ఉపాధ్యక్షుడు గట్టా మంజు తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా మండలంలోని పలు పంచాయతీల్లో వైసీపీ మండల కన్వీనర్ గజేంద్ర అధ్యక్షతన కోటి సంతకాల సేకరణ గురువారం నిర్వహించారు.



యువతి నుంచి సంతకం సేకరిస్తున్న వైసిపి నాయకులు

సత్యసాయి శతజయంతి వేడుకలకు ముస్తాబవుతున్న పుట్టపర్తి



పుట్టపర్తి శివారులో ఏర్పాటు చేసిన ఆర్చ్

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

సత్యసాయి శతజయంతి ఉత్సవాలకు ప్రశాంతి నిలయం, పుట్టపర్తి ముస్తాబవుతోంది. నవంబర్ 17న వేణుగోపాలస్వామి రథోత్సవంతో ఈ వేడుకలు ప్రారంభమవుతాయి. ఈ ఏడాది సత్య సాయి శతజయంతి వేడుకలను ఘనంగా నిర్వహించాలని సత్యసాయి ట్రస్టు తగిన ఏర్పాట్లకు సిద్ధమవుతోంది. నవంబర్ 19 న అంతర్జాతీయ మహిళా దినోత్సవం, 22న సత్యసాయి యూనివర్సిటీ స్నాతకోత్సవం, 23న సత్యసాయి జన్మదిన వేడుకలు సాయి కుల్వంతహాలులో ఘనంగా జరగనున్నాయి. స్నాతకోత్సవంలో రాష్ట్రపతి ద్రౌపతి ముర్ముతో పాటు రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ హాజరవనున్నారు. 21న లేదా 23న దేశ ప్రధాని నరేంద్ర మోడీ పాల్గొనే అవకాశం ఉంది. ప్రధానికి స్వాగతం పలకడానికి రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ రానున్నారు. ఏపీ, తెలంగాణ, కర్నాటక ముఖ్యమంత్రి, గవర్నర్లతో పాటు రాష్ట్రపతి, ప్రధానమంత్రినిసత్యసాయి మేనేజింగ్ ట్రస్టీ ఆర్ జె రత్నాకర్ తో పాటు ట్రస్టు సభ్యులు స్వయంగా కలిసి ఈ వేడుకల్లో పాల్గొనాలని ఆహ్వానించారు. వివిఐపీలతో పాటు పలువురు వీఐపీలు, పెద్ద ఎత్తున భక్తులు ఈ వేడుకల్లో పాల్గొనే అవకాశం ఉంది. 10 లక్షల మంది ఈ వేడుకల్లో పాల్గొనే అవకాశం ఉందని ట్రస్టు వర్గాలు భావిస్తున్నాయి. అందుకు అనుగుణంగానే ఏర్పాట్లు చేపట్టారు.

రహదారుల నిర్మాణానికి రూ. 30 కోట్లు మంజూరు

తరలివచ్చే వారందరికీ తాత్కాలిక వసతులు, భోజనాలు, తాగునీరు, తాత్కాలిక మరుగుదొడ్లు తదితర మౌలిక సదుపాయాలను ట్రస్టుతో పాటు ప్రభుత్వ అధికారులు తగు చర్యలు చేపడుతున్నారు. ప్రశాంతి నిలయం పడమటి గేటు నుంచి పెట్రోల్ బంక్ వరకు రెండు కిలోమీటర్ల రహదారి యుద్ధ ప్రతిపాదికన చేపట్టారు. స్వాగత అర్చీలు నిర్మిస్తున్నారు. రహదారుల నిర్మాణాలకు మరమ్మతులకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. చిత్రావతి నది పరివాహకంలో సుందరీకరణ పనులు, పార్కు నిర్మాణం జరుగుతున్నాయి. ఏ ఒక్కరికి ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా జిల్లా కలెక్టర్ ఆదేశాలతో సంబంధిత అధికారులు అందరూ మౌలిక సదుపాయాలపై దృష్టి పెట్టారు. ట్రస్టు కూడా అన్నదానంతో పాటు ప్రశాంతి నిలయంలో తగిన సౌకర్యాలు కల్పన పై దృష్టి పెట్టింది.

వాల్మీకులు రాజకీయాల్లో రాణించాలి : ఎంపీలు

ప్రజాశక్తి-రొద్దం

వాల్మీకి సామాజికవర్గం ప్రజలు అన్ని రంగాలతో పాటు రాజకీయంగా కూడా ఎదగాలని ఎంపిలు బికె.పార్థసారథి, అంబికా లక్ష్మీనారాయణ ఆకాంక్షించారు. మండలంలోని పి.రొప్పాల గ్రామం లో ఏర్పాటు చేసిన వాల్మీకి విగ్రహాన్ని గురువారం ముఖ్యఅతిథులుగా హాజరైన ఎంపిలు ఆవిష్క రించారు. ముందుగా వారిని గ్రామస్తులు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఎంపి పార్థసారథి మాట్లాడుతూ వాల్మీకి రాసిన గ్రంథాలు నేటి తరానికి ఆచరణీయమన్నారు. ఎన్నికల హామీ మేరకు అన్ని కులాల వారికి కల్యాణ మండపాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఎంపి అంబికా మాట్లాడుతూ వాల్మీకి విగ్రహం ఏర్పాటుకు 12 ఏళ్ల క్రితమే అప్పటి ఎమ్మెల్యే అయిన బికె.పార్థసారథి రూ. 75 వేలు అందజేసినట్లు కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు సుబ్బరత్నమ్మ, చిన్నప్పయ్య, నరసింహులు, టిడిపి మండల కన్వీనర్ నరహరి, రాము, తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లు పరిశీలన

ప్రజాశక్తి కదిరి టౌన్

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నవంబర్ 1న తలుపుల మండలంలోని పెద్దన్నవారిపల్లి గ్రామంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ' కార్యక్రమానికి హాజరుకానున్నారు. సిఎం పర్యటన నేపథ్యంలో హెలిపాడ్ సభాస్థలి, భద్రతా పరమైన ఏర్పాట్లను ఎమ్మెల్యే కంది కుంట వెంకట ప్రసాద్, ఎ .శ్యామ్ ప్రసాద్, ఎస్పీ ఎస్. సతీష్ కుమార్ గురువారం పరిశీలించారు. హెలిప్యాడ్ ప్రదేశం, పింఛన్ల పంపిణీ చేసే లబ్ధిదారుల నివాసాలను పరిశీలించారు. అక్కడ చేపట్టాల్సిన భద్రతా ఏర్పాట్లను సమీక్షించారు. ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి ఎటువంటి లోపం లేకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. వాహనాల నియంత్రణ, ట్రాఫిక్ మళ్లింపు చర్యలు పై సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవోలు సువర్ణ, శర్మ, డిఎస్‌పి. శివన్నారాయణ స్వామి, ఎస్బి సిఐ వెంకటేశ్వర్లు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రహదారి నిర్మాణానికి భూమిపూజ

ప్రజాశక్తి-చిలమత్తూరు

మండలంలోని శెట్టిపల్లి పంచాయతీ కమ్మయ్యగారిపల్లి గ్రామానికి చేపట్టిన రహదారి నిర్మాణ పనులకు గురువారం టిడిపి మండల నాయకులు భూమిపూజ చేసి ప్రారంభించారు. వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే బాకృష్ణ ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నారన్నారు. గ్రామాల అభివృద్ధి కోసం ఎమ్మెల్యే ఎంత కృషి చేస్తున్నారన్నారు. ప్రజల సమస్యలను పరిష్కరించడంలో ఎప్పుడూ ముందుంటారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు రంగారెడ్డి, బేకరీ గంగాధర్, గౌరీశంకర్, నాగరాజుయాదవ్, శ్రీదేవి, విజయ్‌కుమార్, ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

'పది' పరీక్ష కేంద్రాల పరిశీలన

ప్రజాశక్తి-గోరంట్ల


2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి పదో తరగతి పబ్లిక్ పరీక్షలు నిర్వహించే కేంద్రాలను గురువారం జిల్లా విద్యాశాఖ అసిస్టెంట్ కమిషనర్ ఎగ్జామినేషన్స్ లాజర్, డివైఈఓ జాన్‌రెడ్డప్ప పరిశీలించారు. వారు పట్టణంలోని బాలుర, బాలికల జడ్పీ హైస్కూళ్లతో పాటు ఉర్దూ ఉన్నత పాఠశాల, న్యూ మాంటిస్సోరీ పాఠశాలలను క్షుణ్ణంగా పరిశీలించారు. వారు మాట్లాడుతూ గదుల్లో సరైన వెలుతురు, ఫ్యాన్లు, లైట్లు ఏర్పాటు చేయాలని, టాయిలెట్స్ సక్రమంగా ఉండేలా చూడాలని హెచ్‌ఎంలకు సూచనలు చేశారు. వారి వెంట బాయ్స్ హైస్కూల్ హెచ్‌ఎం బి.ఈశ్వర్‌ప్రసాద్, మిగిలిన పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఉన్నారు.

పాఠశాల తనిఖీ

ప్రజాశక్తి-గాండ్లపెంట

స్థానిక జడ్పీ హైస్కూల్‌ను గురువారం జిల్లా నోడల్ అధికారి అబ్దుల్ మాలిక్ సందర్శించారు. పాఠశాలలోని ల్యాబ్‌లో జరుగుతున్న విద్యుద్దీకరణ పనులను పరిశీలించి మరింత వేగవంతం చేయాలని హెచ్‌ఎం టి.ప్రసాద్‌ను ఆదేశించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటికే దాదాపు 44 పాఠశాలలకు ల్యాబ్‌లు మంజూరయ్యాయని, నూతనంగా మరో 19 పాఠశాలలను ఎంపిక చేశారన్నారు. అందులో గాండ్లపెంట ఉందన్నారు. ల్యాబ్ అపరేషన్ కోసం ఫీల్డ్ మేనేజ్‌మెంట్ స్టాఫ్‌ను కేటాయిస్తామని తెలిపారు. ఆయన వెంట ఉపాధ్యాయులు పామిడి ముంతాజ్ అలీ, లక్ష్మీనారాయణరెడ్డి, వివేకానందరెడ్డి, నర్సింహారెడ్డి, తదితరులు ఉన్నారు.

వాడీవేడిగా కౌన్సిల్‌మీట్



సమావేశంలో మాట్లాడుతున్న కౌన్సిలర్ చందమూరి నారాయణరెడ్డి

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

పట్టణంలోని పురపాలక సంఘ కార్యాలయంలో గురువారం నిర్వహించిన కౌన్సిల్ సమావేశం రసాబాసగా కొనసాగింది. అజెండాకు సంబంధించిన 23 అంశాలను చదవక ముందే కౌన్సిలర్లు అడ్డుకున్నారు. తొలుత కేబుల్ అజెండాపై చర్చ జరపాలని మున్సిపల్ కమిషనర్ సాయికృష్ణను కోరగా, మొదట 23 అంశాలపై చర్చ జరగాలని, ఆ తర్వాతనే చట్ట ప్రకారం చర్యలు తీసుకొని న్యాయం చేస్తామని తెలిపారు. దీంతో అజెండాను తాము తీర్మానించామని కౌన్సిలర్లు చెప్పారు. కౌన్సిలర్ తీరుకు నిరసనగా కౌన్సిలర్లు సమావేశాన్ని బాయ్ కాట్ చేశారు. అంతకు ముందు మున్సిపల్ ఛైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మి మాట్లాడుతూ కౌన్సిల్ సమాచారాన్ని మూడు రోజులు ముందుగా తెలపాలని ఎన్నో సమావేశాల్లో తెలిపిన కూడా అధికారులుగా ఎందుకు స్పందించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతేకాకుండా తాము ఇచ్చిన టేబుల్ అజెండాను చర్చించాలని, ఇది ప్రజలకు సంబంధించిన విషయం అని తెలిపిన కూడా అధికారులు ఎందుకు స్పందించడం లేదని, దీని వెనుక ఎన్డీఏ కూటమి నాయకుల ప్రమేయం ఉందా అని ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. అజెండా ఆమోదానికి తాము అడ్డు కాదని, పట్టణ అభివృద్ధికి అడ్డు కాదని, అజెండాకు ముందు పట్టణ సమస్యలు మాట్లాడితే తప్పా అని అధికారులను నిలదీశారు. ఛైర్‌పర్సన్‌తో పాటు వైస్ చైర్మన్ జయరాం రెడ్డి, కౌన్సిలర్ చందమూరి నారాయణరెడ్డి, కౌన్సిలర్లు మాసపల్లి సాయికుమార్, భాగ్యలక్ష్మి మాట్లాడుతూ కుక్కల ఆపరేషన్ కొరకు రూ. 18 లక్షలు ఖర్చు చేశారని, ఆ ఖర్చుకు లెక్క చెప్పాలని నిలదీశారు. ఎన్ని కుక్కలకు వైద్యం చేశారన్న వివరాలు ఎందుకు చెప్పడం లేదని ప్రశ్నించారు. ఇకపోతే పట్టణంలో వీధి లైట్లు, తాగునీటి సమస్య, తదితర సమస్యలను ఎప్పుడు చర్చించినా దానికి పరిష్కారం అధికారులు ఎందుకు చూపడం లేదో చెప్పాలని నిలదీశారు. మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి ధర్మవరం అభివృద్ధికి ఎంతో కృషి చేశారని అలాంటి మాజీ ఎమ్మెల్యే జన్మదిన వేడుకల ఫ్లెక్సీని ఎందుకు మీరు తొలగించాలని ప్రశ్నించారు. మరి టిడిపి, బిజెపి, జనసేన పార్టీల ఫ్లెక్సీలు ఇప్పటివరకు సమయం అయిపోయినా ఎందుకు తొలగించాలేదన్నారు. ఫ్లెక్సీలు కట్టినవాళ్లు మున్సిపల్ కార్యాలయానికి చలానా కట్టారా? ఎంత కట్టారు అన్న వివరాలను వెల్లడించాలని అధికారులను ప్రశ్నించారు. కౌన్సిలర్లకు కమిషనర్లకు మధ్య మాటల యుద్ధం అధికం కావడంతో అధికారులు తయారుచేసిన అజెండాను తాము తిరస్కరిస్తున్నామని సమావేశాన్ని బాయ్‌కాట్ చేస్తున్నామని కౌన్సిలర్లు వెళ్లిపోయారు. చేసేది ఏమీలేక అధికారులు కూడా సమావేశం నుంచి వెళ్లిపోయారు. కౌన్సిల్ సమావేశానికి ముందే కమిషనర్‌ను, కౌన్సిలర్లను ఛైర్‌పర్సన్ తన ఛాంబర్‌కు పిలిపించుకుని మాట్లాడారు. పోతుల నాగేపల్లి, కొనుతురు, రేగాటిపల్లి కాలనీలను మున్సిపాలిటీ లోకి చేర్చేలా అజెండాలో ఎందుకు పొందుపరిచారని ప్రశ్నించారు. కౌన్సిల్ సమావేశానికి టిపిఒ ఎందుకు హాజరవడం లేదని అడిగారు. కౌన్సిల్ సమావేశానికి సంబంధిత అధికారులు తప్పనిసరిగా హాజరైనప్పుడే పట్టణములోని సమస్యలు సులభతరంగా చర్చించే అవకాశం ఉంటుందని అన్నారు. 11 గంటలకు సమావేశం కావలసిన కౌన్సిల్ సమావేశం 12 గంటలకు మొదలైంది. కమిషనర్ ఏకపక్షంగా వ్యవహరించడం సరైన పద్ధతి కాదని కౌన్సిలర్లు విమర్శించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ విభాగంలోని వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

కల్తీ కల్లు విక్రయాలపై ప్రత్యేక నిఘా


మాట్లాడుతున్న ఎక్సైజ్ జిల్లా సూపరింటెండెంట్ గోవింద నాయక్

ప్రజాశక్తి-హిందూపురం

జిల్లా వ్యాప్తంగా కల్తీ కల్లు విక్రయాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు ఎక్సైజ్ జిల్లా సూపరింటెండెంట్ గోవింద నాయక్ పేర్కొన్నారు. బుధవారం హిందూపురం రూరల్ మండలం తో పాటు వారికి మండలంలో పలువురు కల్తీ కల్లు తాగి అస్వస్థతకు గురైన విషయం తెలిసిందే. దీనిపై గురువారం పట్టణంలోని ఎక్సైజ్ స్టేషన్ లో సీఐ లక్ష్మీ దుర్గయ్య తో కలిసి ఎక్సైజ్ జిల్లా సూపరింటెండెంట్ గోవింద నాయక్ విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేసి మాట్లాడారు. హిందూపురం రూరల్ మండలం చౌలూరు, పరిగి మండలంలోని గల కొన్ని గ్రామాల్లో కల్తీ కల్లు సేవించి ఆసుపత్రుల్లో వైద్య సేవలు పొందుతున్నారన్నది అవాస్తవం అన్నారు. ఏదైనా ఒక వ్యసనానికి అలవాటు పడి ఒక్కసారిగా దానిని మానేస్తే వచ్చే అనర్థాలతో వారు ఆసుపత్రిలో చేరారన్నారు. ఎక్సైజ్ నిబంధనల మేరకు పిసిఎస్ టిఎఫ్ టి అనుమతులు ఉన్నవారు మాత్రమే కల్లును విక్రయించాల్సి ఉందన్నారు. భవిష్యత్తులో కల్లు దుకాణాల పట్ల ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తామన్నారు.

బాధితులను పరామర్శించిన డిఎంహెచ్ఒ

కల్తీ కల్లు ద్వారా అనారోగ్యం పాలై హిందూపురం పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారిణి డాక్టర్ ఫైరోజ్‌బేగం గురువారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అన్నపూర్ణ, సైక్రియాటిక్ డాక్టర్ జీవనతో మాట్లాడారు. చికిత్స పొందుతున్న వారి ఆరోగ్య పరిస్థితులపై ఆరా తీశారు. ఈ సందర్భంగా డిఎంఅండ్ హెచ్ఓ మాట్లాడుతూ కొన్ని మత్తు అలవాట్లు మానుకోవడంతో కొన్ని వింత లక్షణాలు కలుగుతాయని అన్నారు. ప్రస్తుతం వారి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని డాక్టర్ జీవన తెలిపారు.

కల్తీ కల్లు విక్రయాలపై ఎక్సైజ్ సిఐకు ఫిర్యాదు

హిందూపురం ప్రాంతంలో కల్తీకల్లు విక్రయాలపై ఎక్సైజ్ అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని రాజకీయ ఐక్య పార్టీల నాయకులు డిమాండ్ చేశారు. అలాగే కల్తీ కల్లు సేవించి అనారోగ్యానికి గురైన బాధితులను అన్ని విధాలా ఆదుకోవాలన్నారు. ఈ మేరకు గురువారం ఎక్సైజ్ సీఐ లక్ష్మీ దుర్గయ్యకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆర్పిఎస్ పార్టీ జిల్లా కార్యదర్శి ఏ. శ్రీనివాసులు, దళిత సమైక్య నాయకులు ఎస్.నారాయణ, ఎరుకుల హక్కుల పోరాట సమితి వ్యవస్థాపకులు కే.శంకరయ్య, జై భారత్ భీమరావు పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు నాగరాజ్, ఏపీ ఆర్ ఎస్ పార్టీ కార్యదర్శి కొడమూరు నౌషాద్, ఆర్ ఎఫ్ ఎఫ్ అధ్యక్షులు ఊటుకూరు నరసింహమూర్తి, నాయి బ్రాహ్మణ సేవా సంఘం నాయకులు నరసింహమూర్తి పాల్గొన్నారు.


చికిత్స పొందుతున్న వారిని పరామర్శిస్తున్న డిఎంహెచ్ఒ

కల్తీ కల్లు, నకిలీ మద్యం అరికట్టాలి : వైసిపి

నియోజకవర్గంలోనే కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా కల్తీ కల్లు, నకిలీ మద్యం, బెల్టు షాపుల్లో మద్యం ఏరులైపారుతోందని హిందూపురం వైసిపి సమన్వయకర్త దీపిక విమర్శించారు. పట్టణంలోని వైసిపి కార్యాలయంలో ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం కల్తీ కల్లు, నకిలీ మద్యాన్ని ప్రోత్సహిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతోందని ఆమె మండిపడ్డారు. హిందూపురంలో 15 మంది అస్వస్థతకు గురైన ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో చూస్తే ఎమ్మెల్యే బాలకృష్ణ కల్తీ కల్లు, నకిలీ మద్యాన్ని ప్రోత్సహిస్తున్నారా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయని అన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర మైనార్టీ సెల్ కార్యదర్శి అమానుల్లా, మండల కన్వీనర్ రాము, నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు రామాంజినేయులు పాల్గొన్నారు.

అవినీతిని రూపుమాపాలి

ప్రజాశక్తి-పెనుకొండ

అవినీతిని అంతం చేయడమే సామాజిక లక్ష్యం కావాలని పట్టణంలోని పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ కె.జయప్ప పిలుపునిచ్చారు. డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్, కామర్స్ విభాగం సంయుక్తంగా గురువారం కళాశాలలో విజిలెన్స్ వారోత్సవాలు నిర్వహించారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ ప్రస్తుతం అన్ని రంగాలు, వ్యవస్థలు, విభాగాల్లో అవినీతి కూరుకుపోయింది అన్నారు. సాధ్యమైనంత వరకు అవినీతిని అంతమొందిస్తేనే ఆయారంగాల ఫలాలు ప్రజలకు అందుతాయన్నారు. ఐక్యుఎసి కోఆర్డినేటర్ డి.యశోదరాణి మాట్లాడుతూ వస్తు ఉత్పత్తి నిర్వహణలో నాణ్యత పెంచాలన్నారు. కామర్స్ అధ్యాపకులు నారాయణ, ఎన్ఎస్ఎస్ పిఒ కాంతారావు మాట్లాడుతూ నిత్యావసర వస్తువుల నాణ్యత లోపిస్తే విజిలెన్స్ కమిషన్ కొరడా ఝుళిపించాలన్నారు. విద్యార్థి దశలోనే సామాజిక స్పృహ కలిగిఉండి సేవా కార్యక్రమల్లో పాల్గొంటూ అవినీతిని పారదోలాలని సూచించారు. వృత్తి నిర్వహణలో ప్రతి వ్యక్తి తనదైన పాత్ర పోషిస్తూ, సేవాభావంతో ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు చంద్రమోహన్, రామన్న, విద్యార్థులు పాల్గొన్నారు.


పెనుకొండ కళాశాలలో మాట్లాడుతున్న ప్రిన్సిపల్ జయప్ప

హిందూపురం : సమాజంలో జరుగుతున్న అవినీతిపై పట్టణంలోని ఎంజిఎం పాఠశాలలో విద్యార్థులకు అవినీతి నిరోధక శాఖ అధికారి హమీద్ ఖాన్ ఆధ్వర్యంలో గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా హమీద్ ఖాన్ మాట్లాడుతూ విజిలెన్స్ అవేర్నెస్ వీక్ కార్యక్రమంలో భాగంగా అవినీతి నిరోధక శాఖ ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలను ఏర్పాటు చేశామన్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అవినీతి రహిత సమాజం కోసం కృషి చేయాలని, అందులో భాగంగా ఏసిబికి సహకరించి అవినీతి అధికారుల గురించి ఫిర్యాదు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


మాక్ అసెంబ్లీకి ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

మాక్ అసెంబ్లీకి విద్యార్థులు ఎంపిక

ప్రజాశక్తి-కొత్తచెరువు, రొద్దం

నియోజకవర్గ స్థాయిల్లో నిర్వహించిన పోటీల్లో విద్యార్థులు ప్రతిభ చాటి అమరావతిలో నిర్వహించే మాక్ అసెంబ్లీకి ఎంపికైనట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు. పుట్టపర్తి నియోజకవర్గ స్థాయిలో గురువారం కొత్తచెరువు ఎంఆర్‌సి కార్యాలయంలో నిర్వహించిన పోటీల్లో కొత్తచెరువు మండ లం తలమర్ల జడ్పీ హైస్కూల్ విద్యార్థిని నిషిత(10వ తరగతి) ప్రతిభ చాటినట్లు ఎంఇఒలు ఖాదర్‌వలి, బొల్లె ప్రసాద్ తెలిపారు. పెనుకొండ నియోజకవర్గ స్థాయిలో నిర్వహించిన పోటీల్లో రొద్దం మండలం లోని కోగిర జడ్పీ హైస్కూల్ విద్యార్థి జయవర్ధన్ ఎంపికైనట్లు పెనుకొండ డివైఈఓ జాన్‌రెడ్డప్ప, ఎంఇఒలు రాఘవయ్య, సుధాకర్ తెలిపారు. వీరు రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా నవంబర్ 26వ తేదీ అమరావతిలో నిర్వహించే మాక్ అసెంబ్లీలో పాల్గొంటారని వారు తెలిపారు.

పాఠశాల గేటుకు బోర్డు ఏర్పాటు

రొద్దం : స్థానిక ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల గేటుకు గురువారం ఉపాధ్యాయులు 'వాహనాలు నిలుపరాదు' అని బోర్డు ఏర్పాటు చేశారు. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఆవరణలో ప్రయివేటు వ్యక్తులు ద్విచక్ర వాహనాలు పార్కింగ్ చేసి వెళ్తుండడంపై గురువారం ప్రజాశక్తిలో 'ప్రభుత్వ బడిలో ప్రయివేట్ పార్కింగ్' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన మండల విద్యాశాఖ అధికారులు ఆ పాఠశాల ప్రధాన గేటుకు 'పాఠశాల ఆవరణంలో వాహనాలు నిలపరాదు' అనే బోర్డు ఏర్పాటు చేశారు. అలాగే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.


పాఠశాలకు గేట్‌కు తగిలించిన బోర్డు

ఉచిత కంటి వైద్య శిబిరం

లేపాక్షి: మండలంలోని సిరివరం గ్రామంలో గురువారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో వైద్యులు గోవర్ధన్‌రెడ్డి, సుబ్బారావు 60 మందికి కంటి పరీక్షలు చేయగా 22 మందికి ఆపరేషన్ అవసరమని గుర్తించారు. వారిని నవంబర్ 1వ తేదీ కడపలోని పుష్పగిరి హాస్పిటల్‌కు తీసుకెళ్లి ఉచితంగా శస్త్రచికిత్స చేస్తారని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షుడు కళ్యాణ్ కుమార్, కార్యదర్శి శ్రీధర్‌గౌడ్, తిమ్మారెడ్డి పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించిన ఎంపిపి

ప్రజాశక్తి-గాండ్లపెంట

ఇచ్చిన హామీ మేరకు మండలంలోని ముద్దన్నగారిపల్లిలో తాగునీటి సమస్యను పరిష్కరించినట్లు ఎంపిపి జి.సోమశేఖర్‌రెడ్డి తెలిపారు. ఆయన మాట్లాడుతూ తాగునీటి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఇటీవల గ్రామస్తులు ఎంపిడిఒ కార్యాలయం వద్ద వర్షాన్ని సైతం లెక్క చేయకుండా ధర్నా చేపట్టిన విషయం తెలిసిందే అన్నారు. అప్పుడు ఇచ్చిన హామీ మేరకు బోరుకు నూతన మోటార్ ఏర్పాటు చేసి తాగునీటి సమస్యను పరిష్కరించామని తెలిపారు. దీంతో గ్రామస్తులు, మహిళలు ఎంపిపికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్ మంజూరు

ప్రజాశక్తి-అమరాపురం

లో ఓల్టేజీ సమస్యతో మండలంలోని దేవగానపల్లి గ్రామ ఎస్సీ కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. గ్రామస్తులు ఈ సమస్యను ఎమ్మెల్యే ఎంఎస్.రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన వారు వెంటనే ఆ సమస్యను పరిష్కరించాలని మండల విద్యుత్ అధికారి సిద్దేశ్వరను ఆదేశించారు. దీంతో విద్యుత్ శాఖ అధికారులు గురువారం 16 కెవి ట్రాన్స్‌ఫార్మర్ మంజూరు చేసినట్లు టిడిపి మండల కన్వీనర్ ఈ.కృష్ణమూర్తి తెలిపారు. కార్యక్రమంలో నాయకులు లింగరాజు, మండల డీలర్ల సంఘం ఉపాధ్యక్షుడు హనుమంతరాయ, మల్లికార్జున, అంజనప్ప, శివన్న పాల్గొన్నారు.


మసీదులో ఆర్ఒ ప్లాంట్‌కు ఎంపి చేయూత

రొద్దం : స్థానిక మసీదులో మినరల్ వాటర్ ప్లాంట్ నిర్మాణానికి నిధులు కేటాయించాలని ముస్లిం మైనార్టీలు ఎంపి బికె.పార్థసారధిని కోరారు. వారు గురువారం మండలంలోని ఆర్.మరువపల్లి గ్రామం వెళ్లి ఎంపిని కలిసి విన్నవించారు. స్పందించిన ఎంపి ప్లాంట్ ఏర్పాటుకు రూ. 6.50లక్షలు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. ఎంపిని కలిసిన వారిలో ఖలీం, బాబు, నజీర్, అల్లాబకష్, మహబూబ్‌బాషా, సమీవుల్లా, మాసూద్, ఇస్మాయిల్, అజ్మతుల్లా, ఈమామ్, మున్నా, తదితరులు ఉన్నారు.

యుటిఎఫ్ మండల కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-పరిగి

మండలంలోని కొడిగెనహళ్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో గురువారం యుటిఎఫ్ మండల శాఖను ఎన్నుకున్నట్లు జిల్లా ఆడిట్ కన్వీనర్ మహంతీష్ తెలిపారు. యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ మారుతి శ్రీనివాసులు, జిల్లా ఉపాధ్యక్షులు జిహెచ్.బాబు ఎన్నికల అధికారులుగా వ్యవహరించారు. వారు మాట్లాడుతూ రాష్ట్ర, జిల్లా, మండల స్థాయిలో ఉపాధ్యాయులకు ఎలాంటి సమస్య ఎదురైనా యుటిఎఫ్ బాధ్యతగా తీసుకొని పరిష్కరించేందుకు కృషి చేస్తుందన్నారు. ఉపాధ్యాయులకు రావాల్సిన పిఆర్‌సి, ఐఆర్, డిఎ, తదితర అంశాల విషయంలో ప్రభుత్వాలతో రాజీలేని పోరాటం చేస్తుందన్నారు. అధ్యయనం, అధ్యాపనం, సామాజిక స్పృహలో భాగంగా పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్నామ న్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు కృపాసత్యరాజ్, లక్ష్మీపతి, ఎన్‌కె.పద్మావతి, జిఆర్.శ్రీనివా సులు, శంకరనాయక్, శ్రీనివాసులు, అశ్వత్థనారాయణ, రంగనాథరాజు తదితరులు పాల్గొన్నారు.


యుటిఎఫ్ మండల నూతన కమిటీ సభ్యులు

బస్సు సౌకర్యం కల్పించాలని ధర్నా

ప్రజాశక్తి-ఓబుళదేవరచెరువు

ఎపిఎస్ ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం మండలంలోని మహమ్మదాబాద్ క్రాస్ వద్ద ప్రజలు కదిరి-హిందూపురం ప్రధాన రహదారిపై ధర్నా చేపట్టారు. వారు ముందుగా అక్కడ ఓ షామియానా వేసి రోడ్డుపై బైఠాయించి బస్సు సౌకర్యం కల్పించాలని నినాదాలు చేశారు. వారు మాట్లాడుతూ హైవే రోడ్డు నిర్మాణం జరిగినప్పటి నుంచి గ్రామంలోకి ఒక్క బస్సు కూడా రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఈ విషయంపై బస్సు డ్రైవర్లను నిలదీస్తే హైవేపై డివైడర్ క్లోజ్ చేసి ఉండడంతో రాంగ్ రూట్‌లో రావాల్సి ఉందని, దీంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, కావున రోడ్డు కాంట్రాక్టర్‌తో మాట్లాడి డివైడర్ తెరిపించాలని సమాధానం ఇచ్చారన్నారు. ఇదే విషయంపై ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్‌కు విన్నవించగా సంబంధిత శాఖ అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారన్నారు. కానీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని వాపోయారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ మల్లికార్జునరెడ్డి, అధికారులు అక్కడికి చేరుకుని వారితో చర్చించి సమస్యను వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు.


బస్సు సౌకర్యం కల్పించాలని బైటాయించిన గ్రామస్తులు

మార్కెట్ యార్డ్ అభివృద్ధికి కృషి : పల్లె

ప్రజాశక్తి-కొత్తచెరువు

పుట్టపర్తి మార్కెట్ యార్డ్ అభివృద్ధికి ప్రభుత్వం పరంగా తమ వంతు కృషి చేస్తామని మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి తెలిపారు. స్థానిక మార్కెట్ యార్డ్‌ను గురువారం పల్లె పరిశీలించారు. ముందుగా మార్కెట్ యార్డ్ చైర్మన్, డైరెక్టర్లు పల్లెకు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. పల్లె మాట్లాడుతూ ప్రధాన రహదారి, మార్కెట్ యార్డ్ స్థలంలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం, అర్ధాంతంగా ఆగిన ఎసి గోడౌన్ పనులకు ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయించి, ఆయా పనులను త్వరితగతిన పూర్తి చేయిస్తామన్నారు. అనంతరం మార్కెట్ యార్డ్ సమావేశంలో నిర్వహించి, చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై పాలక మండలికి సలహాలు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో డైరెక్టర్లు నిజాంవలి, జయశ్రీ, నంజప్ప, హేమావతి, సుధీర్, సురేష్, మస్తానమ్మ, ప్రవీణ్, గోపీనాథ్‌రెడ్డి, కిలారి శ్రీనాథ్, నాగరత్న, తదితరులు పాల్గొన్నారు.


మార్కెట్ యార్డ్‌ను పరిశీలిస్తున్న పల్లె, నాయకులు

మడకశిర ఎస్ఐగా లావణ్య

మడకశిర టౌన్ : మడకశిర అప్‌గ్రేడ్ పోలీస్ స్టేషన్ ఎస్ఐగా లావణ్య గురువారం బాధ్యతలు చేపట్టారు. వీఆర్‌లో ఉన్న లావణ్యను పోలీస్ ఉన్నతాధికారులు మడకశిర పోలీస్ స్టేషన్‌కు అటాచ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో ఈమె అగళి ఎస్ఐగా పని చేశారు. ఆమె మాట్లాడుతూ మండలంలో అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపుతామని తెలిపారు.

పంచాయతీ ఆదాయంపై శిక్షణ

బుక్కపట్నం : పంచాయతీల ఆదాయం పెంచి గ్రామాలను అభివృద్ధి చేయాలని ఎంపిడిఒ శ్రీనివా సులు సూచించారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయ ఆవరణలో గురువారం సర్పంచులు, గ్రామ కార్యదర్శులు, డిజిటల్, ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు పంచాయతీలో సొంత వనరులను ఎలా సమకూర్చుకోవాలనే అంశంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎంపిడిఒ మాట్లా డుతూ ప్రతి ఒక్కరూ గ్రామాల్లో ఇంటి, నీటి పన్ను చెల్లించి పంచాయతీ అభివృద్ధికి దోహదపడాలని సూచించారు. అలాగే సొంత ఆదాయ మార్గాలను పెంచుకోవడం ద్వారా పంచాయతీలను అభివృద్ధి చేసుకోవచ్చని సూచించారు.

ప్రభుత్వాసుపత్రిలో అన్నదానం

ధర్మవరం రూరల్ : పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో గురువారం యువర్స్ ఫౌండేషన్ అధ్యక్షులు షీలా నాగేంద్ర ఆధ్వర్యంలో 260 మందికి అన్నదానం చేశారు. ఆయన మాట్లాడుతూ యువర్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తున్నామని, వాటికి దాతలు సహాయ సహకారాలు అందించాలని కోరారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ తిప్పేంద్రనాయక్, షీలా నాగేంద్ర, పిఆర్‌సి గుప్తా, సహకార్యదర్శి కేతా లోకేష్, రమేష్‌బాబు, కోశాధికారి వంకదారి మోహన్

పౌర హక్కులపై అవగాహన

లేపాక్షి : మండలంలోని చోళసముద్రం గ్రామం లో గురువారం మండల అధికారులు పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. తహశీల్దార్ సౌజన్యలక్ష్మి మాట్లాడుతూ ప్రతి పౌరుడికి స్వేచ్ఛ, సాతంత్ర్యంతో పాటు సమాజంలో అందరికీ సమానమైన హక్కులు ఉంటాయన్నారు. పౌరుల హక్కులను కాపాడటం ప్రభుత్వం బాధ్యత అన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ నరసింహమూర్తి, ఎఎస్ఐ నారాయణస్వామి, ఆర్ఐ ప్రమీలమ్మ, విఆర్ఎ సూర్య ప్రకాష్, ప్రజలు పాల్గొన్నారు

బాబా శత జయంతి ఉత్సవాల పర్యవేక్షణకు మంత్రుల కమిటీ

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

సత్యసాయి జయంతి ఉత్సవాలు సజావుగా జరగడానికి రాష్ట్ర ప్రభుత్వం ఆరుగురు మంత్రులతో కమిటీ ఏర్పాటు చేసినట్లు గురువారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ ఓ ప్రకటన విడుదల చేశారు. కమిటీ చైర్మన్‌గా రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, సభ్యులుగా పయ్యావుల కేశవ్, సత్యకుమార్ యాదవ్, సవిత, కందల దుర్గేష్, ఆనం రామనారాయణరెడ్డిని నియమించింది. ఉత్సవాలు ప్రారంభం నుంచి ముగిసే వరకు ఈ కమిటీ పర్యవేక్షిస్తుంది. ప్రభుత్వ నిర్ణయంపై ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి హర్షం వ్యక్తం చేస్తూ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.


విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న డిఇఒ జి.కృష్ణప్ప

మెలకువలతో కూడిన విద్యనందించండి
డిఇఒ జి.కిష్టప్ప

ప్రజాశక్తి-కొత్తచెరువు

విద్యార్థులకు మెలకువలతో కూడిన విద్యను అందించాలని డిఇఒ జి.కిష్టప్ప ఉపాధ్యాయులకు సూచించారు. మండలంలోని బండ్లపల్లి, చెన్నరాశిపల్లి జడ్పీ హైస్కూళ్లను గురువారం తనిఖీ చేశారు. పదో తరగతి విద్యార్థులతో ముఖాముఖిగా మాట్లాడి సిలబస్, వారి ప్రోగ్రెస్ గురించి అడిగి తెలుసు కున్నారు. ఎఫ్ఎ-1, 2 పరీక్షల్లో విద్యార్థుల ప్రగతిని అడిగి తెలుసుకున్నారు. కష్టపడి చదువుకొని పరీక్షలకు సిద్ధం కావాలన్నారు. సిలబస్‌ను గడువులోపు పూర్తి చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. డిఇఒ వెంట ఎంఇఒ జయచంద్ర, ఉపాధ్యాయులు మాణిక్యం ఇసాక్, భాస్కర్, తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్య


ప్రజాశక్తి-గోరంట్ల

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అదుతుందని టిడిపి మండల కన్వీనర్ బాలకృష్ణచౌదరి పేర్కొన్నారు. మండలంలోని వానవోలు గ్రామ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం ఎస్ఆర్ఆర్ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు డైరీలు పంపిణీ చేశారు. బాలకృష్ణచౌదరి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ప్రయివేట్‌కు దీటుగా విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు భోజనం అందుతుందన్నారు. మండల వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మంత్రి సవిత సహకారంతో ఎస్ఆర్ఆర్ ఛారిటబుల్ ట్రస్ట్ ద్వారా స్కూల్ డైరీలు పంపిణీ చేశామన్నారు. విద్యార్థులు చక్కగా చదివి ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సింగిల్‌విండో అధ్యక్షులు రమణ, డీలర్ రాఘవనాయుడు, నాయకులు సుభాన్, సత్యనారాయణ, రాయల్ శ్రీనివాసులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


కార్యక్రమంలో మాట్లాడుతున్న బాలకృష్ణచౌదరి

క్రీడాకారులకు యుటిఎఫ్ చేయూత

పెనుకొండ : పెనుకొండ జోనల్ లెవెల్ క్రీడా పోటీల విజేతలకు మెడల్స్ అందజేసేందుకు గురువారం యుటి ఎఫ్ ఆధ్వర్యంలో జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి లక్ష్మణ్ నారాయణకు నగదు అందజేశారు. యుటిఎఫ్ నాయకులు మాట్లాడుతూ పట్టణంలోని ప్రభుత్వ హైస్కూల్ క్రీడా మైదానంలో నిర్వహించిన అండర్-14, 17 పోటీల్లో 14 మండలాల నుంచి విద్యార్థులు పాల్గొన్నారన్నారు. ఈ పోటీల్లో విజయం సాధించిన సుమారు 300 మంది విద్యార్థులకు యుటిఎఫ్ పెనుకొండ జోన్ తరపున మెడల్స్ అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంఇఒ రాఘవయ్య, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శులు నారాయణస్వామి, నరేష్‌కుమార్, వెంకటేష్, శివయ్య పాల్గొన్నారు.


నగదు అందజేస్తున్న యుటిఎఫ్ నాయకులు

ఆర్థిక సాయం అందజేత

చిలమత్తూరు : మండలంలోని శెట్టిపల్లి గ్రామానికి చెందిన రంగప్ప మృతి చెందడంతో గురువారం ఆ గ్రామం వెళ్లి రంగప్ప కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. టిడిపి మండల నాయకులు రంగారెడ్డి మాట్లాడుతూ పార్టీ తరపున ఎల్లప్పుడూ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు అంజనప్ప, మల్లిరెడ్డి, హనుమంతరెడ్డి, ప్రవీణ్, రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

నేడు 'జాతీయ ఐక్యతా దినోత్సవ' ర్యాలీ

ధర్మవరం రూరల్ : సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి ఉత్సవాలు పురస్కరించుకొని దేశవ్యాప్తంగా చేపట్టనున్న 'జాతీయ ఐక్యతా దినోత్సవ' కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం పట్టణంలో ఐక్యతా ర్యాలీ నిర్వహిస్తున్నట్లు మంత్రి కార్యాలయ ఇన్‌ఛార్జి హరీష్ తెలిపారు. ర్యాలీలో మంత్రి సత్యకుమార్ యాదవ్ ముఖ్యఅతిథిగా పాల్గొంటారని తెలిపారు.

వైసిపి ఆధ్వర్యంలో సంతకాల సేకరణ

ప్రజాశక్తి-మడకశిర టౌన్

రాష్ట్రంలో వైద్య కళాశాలల ప్రయివేటీకరణ నిర్ణయాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ గురువారం మండలంలోని బుల్లస ముద్రం గ్రామంలో నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త ఈరలక్కప్ప ఆధ్వర్యంలో పరిశీలకులు రఘునాథ్‌రెడ్డి పర్యవేక్షణలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రయివేటీకరణ చేయడం అంటే పేదలకు వైద్యం, పేద విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేయడమే అన్నారు. పిపిపి పేరుతో అయినవారికి అప్పగించి దోచుకోవడానికి కుట్ర పన్నారన్నారు. ఇప్పటికే ఆరోగ్యశ్రీని నిర్వీర్యం చేశారని మండిపడ్డారు. ఇకనైనా వైద్య కళాశాలలను ప్రభుత్వ ఆధీనంలోనే నిర్వహించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రవిశేఖర్‌రెడ్డి, నాయకులు ఆనందరంగారెడ్డి, నరసింహమూర్తి, రంగేగౌడ్, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న రవిశేఖర్‌రెడ్డి

పరిసరాల పరిశుభ్రతే ఆరోగ్యానికి భద్రత

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

పట్టణంలోని కెహెచ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డా. బి.గోపాల్‌నాయక్ ఆధ్వర్యంలో మండలంలోని గొట్లూరు గ్రామంలో ప్రత్యేక శిబిరం నిర్వహించారు. ప్రిన్సిపల్ డా. కె.ప్రభాకర్‌రెడ్డి మాట్లాడు తూ ఈ నెల 29వ తేదీ నుంచి వారం రోజుల పాటు ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. రెండో రోజైన గురువారం 'స్వచ్ఛ భారత్-పరిసరాల పరిశుభ్రత' కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఆర్చి మెయిన్ రోడ్ నుంచి వేణుగోపాల స్వామి ఆలయం వరకూ, సచివాలయ ప్రాంగణం, అంబేద్కర్ భవనం చుట్టుపక్కల పరిసరాలను ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు శుభ్రం చేశారు. వర్షాకాలం లో ప్రబలే వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పిం చారు. పరిసరాల పరిశుభ్రతే ఆరోగ్యానికి భద్రత అని ప్రిన్సిపల్ సూచించారు. కార్యక్రమంలో ఎ.కిరణ్‌కు మార్, ఎం.భువనేశ్వరి, ఎం.పుష్ప, బి.ఆనంద్, సరస్వతమ్మ, నల్లమ్మ, అధ్యాపక, అధ్యాపకేతర బృందం, ఎన్ఎస్-ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.


గొట్లూరులో స్వచ్ఛభారత్ కార్యక్రమం చేపట్టిన ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు

నిరుద్యోగ యువతకు శిక్షణ

పుట్టపర్తి అర్బన్ : ఉమ్మడి అనంతపురం జిల్లాలోని నిరుద్యోగ యువతకు నైపుణ్యంలో ఉచిత శిక్షణ ఇచ్చి ప్రముఖ కంపెనీల్లో ఉద్యోగావకాశాలు కల్పిస్తామని వెలుగు ఎపిఎం లక్ష్మీనారాయణ, సిడాప్ జాబ్ కోఆర్డినేటర్ ఆంజనేయులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఏదేని డిగ్రీ, ఐటిఐ, డిప్లొమా పూర్తి చేసిన 19-26 ఏళ్లు కలిగిన యువతీ, యువకులు నవంబర్ 4వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. 5జి నెట్‌వర్క్ ప్రాజెక్టు ఇంజినీర్, ఫీల్డ్ మేనేజ్మెంట్ ఇంజినీర్, స్పోకెన్ ఇంగ్లీష్, సాఫ్ట్ స్కిల్, ఇంటర్నెట్ స్కిల్స్ కోర్సుల్లో అనుభవజ్ఞులైన అధ్యాపకుల చేత రామగిరిలో 120 రోజుల పాటు శిక్షణ ఉంటుందన్నారు. ఉచిత వసతి, భోజన సౌకర్యం కల్పిస్తామన్నారు. వివరాలకు 96408 99337లో సంప్రదించాలన్నారు.

ఐటీడీపీ అధ్యక్షుల నియామకం

హిందూపురం : ఎమ్మెల్యే బాలకృష్ణ ఆదేశాల మేరకు గురువారం ఎమ్మెల్యే పిఎ సురేంద్ర నియోజకవర్గ ఐటీడీపీ అధ్యక్షులను నియమించి నియామక ఉత్తర్వులు అందజేశారు. నియోజకవర్గం ఐటీడీపీ అధ్యక్షులుగా ఎస్.నజీర్ అహ్మద్, పట్టణ ఐటీడీపీ అధ్యక్షులుగా కొల్లకుంట అనిల్ కుమార్, లేపాక్షి మండల ఐటీడీపీ అధ్యక్షులుగా బాబా ఫకృద్దీన్, హిందూపురం రూరల్ మండలం అధ్యక్షులుగా ప్రసన్న కుమార్, చిలమత్తురు మండల ఐటీడీపీ అధ్యక్షులుగా మల్లికార్జునలను నియమించారు. తమను ఐటీడీపీ అధ్యక్షులుగా నియమించడం పట్ల వారు ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణకు కృతజ్ఞతలు తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ధర్మవరం రూరల్ : మండలంలోని గొట్లూరు గ్రామ సమీపంలో ఉన్న బిందెల ఫ్యాక్టరీ వద్ద గత మంగళవారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో గుర్తు తెలియని వ్యక్తి తీవ్రంగా గాయపడినట్లు రూరల్ పోలీసులు తెలిపారు. గమనించిన స్థానికులు అతడిని అంబులెన్స్‌లో అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి పంపగా చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతిచెందాడు. వయసు 50-55 ఏళ్లు ఉంటుందని, అతడికి సంబంధించి ఎలాంటి ఆధారాలు లభించలేదని, మృతదేహం అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చురీలో ఉందన్నారు. మృతుని గురించి వివరాలు తెలిస్తే ధర్మవరం రూరల్ సిఐ-94407 96832, ఎస్ఐ-94407 96834కు సమాచారం ఇవ్వాలని కోరారు.

ద్విచక్రవాహనాల దొంగలు అరెస్టు

హిందూపురం : హిందూపురం పట్టడంతో పాటు పరిసర ప్రాంతాల్లో ద్విచక్ర వాహనాలను దొంగలించే ముగ్గురు నిందితులను అరెస్టు చేసి వారి నుంచి 11 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు డి.ఎస్.పి మహేష్ తెలిపారు. గురువారం పట్టణంలోని అప్ గ్రేడ్ స్టేషన్ లో విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేసి కేసుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. గురువారం హిందూపురం రూరల్ మండలం తూమకుంట చెక్ పోస్టులో అప్ గ్రేడ్ స్టేషన్ సీఐ ఆంజనేయులు ఆధ్వర్యంలో వాహనాల తనిఖీలను నిర్వహించామన్నారు. ఒక వాహనంలో హిందూపురం రూరల్ మండలం రామచంద్రాపురం గ్రామానికి చెందిన మోక్షిత్, గౌరీబిదనూరు కు చెందిన ఉమర్ ఫరూక్, హిందూపురం పట్టణంలోని ఆటో నగర్ కు చెందిన జమీర్ ఖాన్ వెళ్తున్నారన్నారు. వారిని ఆపి వాహనానికి సంబంధించి రికార్డులను చూపించాలని కోరామన్నారు. వారు చూపించకపోవడంతో అనుమానం వచ్చి అదుపులోకి తీసుకుని విచారించామన్నారు. దీంతో వారు నేరం అంగీకరించినట్లు చెప్పారు. నిందితులను అరెస్టు చేసి న్యాయమూర్తి ఎదుట హాజరు పరుస్తున్నట్లు వివరించారు. ఈ సమావేశంలో అప్ గ్రేడ్ సిఐ ఆంజనేయులు, వన్ టౌన్ సిఐ రాజగోపాల్ నాయుడు, రూరల్ సీఐ జనార్ధన్, ఎస్ ఐ లు పాల్గొన్నారు.

బాలుడిపై వీధికుక్కల దాడి

ఓబుళదేవరచెరువు : బాలుడిపై వీధి కుక్కలు దాడి చేసి గాయపరిచిన సంఘటన శుక్రవారం ఓబుళదేవరచెరువులో చోటుచేసుకుంది. వివరాలు.. స్థానిక మదీనా మసీదు వెనుక జిలేబి బాబ్‌జాన్ కుమారుడు అకీబ్ ఆడుకుంటుండగా ఒక్కసారిగా వీధి కుక్కలు దాడి చేశాయి. దీంతో బాలుడి చేతికి గాయమై రక్తస్రావ మైంది. స్పందించిన స్థానికులు బాలుడిని కుక్కల దాడి నుంచి కాపాడారు. ఆసుపత్రికి తీసుకెళ్లి సూది మందు వేయించారు. ఇదిలా ఉండగా ఒడిసిలో వీధి కుక్కల బెడద ఎక్కువైందని, పంచాయతీ అధికారులు స్పందించి వాటి నుంచి కాపాడాలని ప్రజలు కోరారు.


కుక్క కరవడంతో గాయపడిన బాలుడు